క్లుప్తంగా

చైత్రమాసం నవరాత్రి పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

ఇల్లెందు: పట్టణంలోని 14 నంబర్ బస్తీలో పాసీ కులస్తులు చైత్ర మాసం సందర్భంగా నవరాత్రులు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం మాజీ కౌన్సిలర్ సుదర్శన్ కోరీ ఆధ్వర్యంలో గాయకులు సుమిత్రబాయి, కిషన్ పాసీ, జ్యోతి, గిరిజాబాయి ప్రత్యేక పూజలు చేశారు. పిల్లాపాపలతో కుటుంబాలు సుఖజీవనం సాగించాలని ఈ పూజా కార్యక్రమంలో వేడుకున్నారు.

నేడు మహా అన్నదానం

జూలూరుపాడు: శ్రీఅయ్యప్ప స్వామి జయంతిని పురస్కరించుకొని ఆదివారం పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరాలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప భక్తబృందం సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఇల్లెందు(టేకులపల్లి): అయ్యప్ప స్వామి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయంలో మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, టేకులపల్లి శ్రీ కోదండ రామాలయం అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో మహా అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: నిరంతరం ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం టీఎస్ యూటీఎఫ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పోరాటం చేస్తుందని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో శనివారం ఫెడరేషన్ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కత్తి శాంసన్, కె.శ్రీదేవి, పుల్లారెడ్డి, ఆర్.కృష్ణ, కె.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నగదు వితరణ


నగదు అందజేస్తున్న ప్రకాశ్

పాల్వంచ: మెదడు నరాలు దెబ్బతినడంతో ఆపరేషన్ నిమిత్తం చలవాది ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నగదు వితరణ చేశారు. కొత్తగూడేనికి చెందిన వేణుగోపాల్‌కు మెదడు నరాలు దెబ్బతినడంతో వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. పేద కుటుంబం కావడంతో ట్రస్ట్ అధ్యక్షుడు చలవాది ప్రకాశ్, మిత్రుల సహకారంతో వేణుగోపాల్ సతీమణి రోహిణికి రూ.30వేల నగదు అందించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ... విద్య, వైద్యం, వివాహాల నిమిత్తం తన వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చలవాది రాజ్యలక్ష్మి, కొత్తగుండ్ల కుటుంబరావు, చిరునోముల ప్రసాద్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు గూడెపు శ్రీనివాస్, సాయి లిఖిత్ పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమ నేతలకు నివాళులు

ఇల్లెందు: జ్యోతీరావు పూలే, అంబేద్కర్, బీటీ రణదివేలు సామాజిక ఉద్యమ నేతలను వారి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ఏ నబీ కోరారు. శనివారం ఇల్లెందులోని మార్కెట్ బిల్డింగ్ అడ్డాలో ఇల్లెందు సీపీఎం, సీఐటీయూల ఆధ్వర్యంలో జ్యోతీరావు పూలే, అంబేద్కర్, బీటీ రణదీవేల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీనజన అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన మహనీయులను విస్మరించరాదన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, శంకర్, మోహన్‌రావు, నాగరాజు, మహమూద్, లక్ష్మణ్, వెంకన్న, శ్రీనివాస్, సోమ్య నాయక్, రాము, సుగుణ పాల్గొన్నారు.


షాపు ముందు అమ్మకానికి పెట్టిన కూలర్లు, ఫ్రిజ్‌లు


కూలర్లను పరిశీలిస్తున్న వినియోగదారులు


కొనుగోలు చేసి తీసుకెళ్తున్న ఫ్రిజ్

వేడి నుంచి ఉపశమనం..

- కూలర్లు, ఏసీలకు గిరాకీ
- గత ఏడాది కంటే 10 శాతం పెరిగిన ధరలు..
- ఎలక్ట్రికల్ షాపుల్లో రద్దీ

సండే స్పెషల్


కొత్తగూడెంలోని ఓ షాపులో ఏసీలను పరిశీలిస్తున్న వినియోగదారులు

కొత్తగూడెంఅర్బన్: బొగ్గు గని ప్రాంతమైన కొత్తగూడెం, చుట్టుపక్కల మండలాల్లో ఎండలకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం నుంచే మొదలవుతున్న ఉష్ణోగ్రతలు మధ్యాహ్నానికి తీవ్ర స్థాయికి వెళ్తున్నాయి. సాయంత్రం 6 గంటలకు కూడా వేడి తగ్గడం లేదు. ప్రతీరోజు 42 డిగ్రీల ఉష్ణోగ్రతల కంటే ఇంకా పెరుగుతున్నాయి. దీంతో అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత నుంచి చల్లదనం కోసం ఎలక్ట్రికల్ పరికరాలతో సేద తీరేందుకు ప్రజలు వాటిని కొనుగొలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. గతవారం నుంచి కొత్తగూడెం పట్టణంలో ఎంతటి ఏసీ అయినా, కూలర్, ఫ్యాన్ గాలి సరిపోవడం లేదని ప్రజలు, దుకాణాదారులు వాపోతున్నారు. ఈ ఉష్ణోగ్రతలకు విద్యుత్ మీటరు రీడింగ్ అధికం అవుతుంది తప్ప, రూంలు, షాపులు మాత్రం కూల్ కావడం లేదంటున్నారు. ఎండలకు తగ్గట్టుగా ఈ ఏడాది ఏసీ, కూలర్, ఫ్యాన్లు వంటి వాటి ధరలు కూడా పది శాతం వరకు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. ధరలతో పాటుగా వారికి అమ్మకాలు కూడా ఈ ఏడాది బాగానే ఉన్నాయంటున్నారు.

మార్కెట్‌లో వివిధ మోడళ్లు...

ఎండలకు ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని వివిధ కంపెనీల ఎలక్ట్రికల్ పరికరాలు మార్కెట్‌లో పుట్టుకొచ్చాయి. రాజస్తాన్ కూలర్, లోకల్ తయారీ కూలర్స్, కంపెనీ కూలర్స్ ఇలా అనేక రకాలుగా మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. ఇక ఏసీ ధరను బట్టి వివిధ రకాల మోడళ్లు రూ.38 వేల మొదలు నుంచి మార్కెట్‌లో ఉన్నాయి. ఇక ఫ్రిజ్‌లు రూ.14 వేలు, కూలర్లు రూ.10 వేల నుంచి, లోకల్ తయారీ కూలర్లు రూ.5 వేల నుంచి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కొత్తగూడెం మార్కెట్‌లోకి కూడా కార్పొరేట్ కంపెనీలకు చెందిన ఎలక్ట్రికల్ పరికరాల షోరూంలు అందుబాటులోకి రావడంతో ఎలక్ట్రికల్ చిరువ్యాపారాలు అవస్థలు పడుతున్నారు. అన్నివర్గాల ప్రజలు ఆకర్షణీయంగా కనిపించే షోరూంలలో కొనుగోలు చేసేందుకే ఇష్టపడుతున్నారని, చిన్న షాపులకు అమ్మకాలపై ప్రభావం పడుతోందని చిరువ్యాపారులు వాపోతున్నారు.



ధరలు పెరిగాయి..



గతేడాది వేసవికాలం కంటే ఈ ఏడాది ఎలక్ట్రికల్ పరికరాల ధరలు పది శాతం పెరిగాయి. అమ్మకాలు బాగానే ఉన్నప్పటికీ ప్రజలు పెద్ద షోరూంలకు వెళ్లి కొనుగోలుకే ఇష్టపడుతున్నారు. దీని వలన చిన్న షాపులలో వ్యాపారం సరిగా జరగడం లేదు.
– కె.మోహన్‌మురళి, ఎలక్ట్రికల్ షాపు యజమాని

సామాన్యులు కొనలేరు..



వేసవికాలం కావడం వలన చల్లదనం కోసం ఉపయోగించే ఎలక్ట్రికల్ పరికరాలకు ధరలు బాగా పెరిగాయి. సామాన్యులు కొనుగోలు చేసే పరిస్థితిలో ఎలక్ట్రికల్ పరికరాల ధరలు లేవు. అధిక ఉష్ణోగ్రతలకు అన్నివర్గాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.
– బి.లక్ష్మణ్, వినియోగదారుడు

చలివేంద్రం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: మండల పరిధి బస్వతారక కాలనీలోని బీసీఎం జాతీయ రహదారి పక్కన శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి ప్రారంభించారు. అనంతరం హైవే పక్కన మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ పొరండ్ల రంగా, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

బోర్లు ఏర్పాటు...

తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిరుతాని పాడు, పెద్దకల ఆదివాసీ గిరిజన గ్రామాల్లో శనివారం బోర్లు నిర్మాణం చేయడం జరిగిందని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి తెలిపారు. రాళ్లచెలకలో నేడు బోరు వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలావతి, ఎంపీఓ బి.నారాయణ పాల్గొన్నారు.

జార్జిరెడ్డి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి


జార్జిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్యాంకుమార్ డిమాండ్ చేశారు. జార్జిరెడ్డి 52వ వర్ధంతిని కొమరారంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మాట్లాడుతూ.. దేశ ప్రజల ఐక్యతకు కుల మతోన్మాద ఫాసిజంకు వ్యతిరేకంగా విద్యార్థి దశ నుంచే పోరాడాలని పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయికరించే కుట్ర చేస్తోందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్తీక్, విక్రం, సాయి, మోహన్, చక్రి, కల్యాణ్, వెంకటేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు


పనులను పర్యవేక్షిస్తున్న డీఈ, ఏఈ

పాల్వంచ: బీసీఎం ప్రధాన రహదారి పక్కన తాగునీటి మెయిన్ పైపులకు శనివారం మరమ్మతులు నిర్వహించారు. జెన్‌కో ట్రెనింగ్ సెంటర్ వద్ద మెయిన్ పైపులైన్ పగిలి భారీగా తాగునీటి వృథాతో పాటు, పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో డీఈ మురళీ, ఏఈ రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం గ్రామంలో ఎనిమిది మంది తనపై దాడి చేసి గాయపర్చారని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కిరణ్ శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ క్షేత్రంలో బోరు వేయకుండా తాను అడ్డుకున్నానన్న అపోహతో ఎనిమిది స్థానికులు పార్టీ కార్యాలయంలో ఉన్న తనతో వాగ్వాదానికి దిగి దాడి చేశారని కిరణ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

రేషన్ డీలర్‌కు పలువురి పరామర్శ


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జూలూరుపాడు: భేతాళపాడు గ్రామ పంచాయతీ పంతులు తండా గ్రామానికి చెందిన రేషన్ డీలర్ గుగులోత్ హరిసన్ తల్లి గుగులోత్ రుక్మిణి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, వెంగన్నపాలెం ఎంపీటీసీ మధుసూదన్‌రావు, ధరావత్ రాంబాబు, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, నర్వనేని పుల్లారావు, పుప్పాల నరసింహారావు, సాయిల కృష్ణయ్య, చౌడం నరసింహారావు, గుగులోత్ రాంబాబు, ప్రియాంక దంపతులు, చలమల నరసింహారావు, వాంకుడోత్ కిషన్, రాంశెట్టి నాగేశ్వరరావు, పలు రాజకీయ పార్టీల నాయకులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా బుడియా బాపు జాతర


జాతరకు హాజరైన నాయకులను సన్మానిస్తున్న పూజారి చందు సాధువు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామంలో శనివారం శ్రీ బాలాజీ బుడియా బాపు జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాపు ఆలయ ప్రధాన పూజారి బానోత్ చందు సాధువు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా భోగ్ బండారో, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ జాతరకు స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి బుడియా బాపును దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజా కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, పాపకొల్లు శివాలయం చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు, వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు మధుసూదన్‌రావు, బానోత్ నవీన్, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, ధర్మరాజుల వెంకటనారాయణ తదితరులు హాజరయ్యారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని, కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని రొంపేడు గ్రామంలో ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీల సంయుక్త సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి వర్తింపజేయాలని, పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, ప్రయాణ చార్జీలు చెల్లించాలని, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా నిర్వహించే దశలవారీ ఆందోళనలో కూలీలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తోడేటి నాగేశ్వరరావు, గౌని నాగేశ్వరరావు, డి.ప్రసాద్, మోత్కూరి మల్లికార్జునరావు, వెంకటమ్మ, నరాటి వెంకటేశ్వర్లు, యాసారపు వెంకన్న, సామేలు, కుంజ కృష్ణ, రాంబాబు, సీతారాములు, సారయ్య, రంగయ్య, బొగ్గారపు సంగయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు కాంగ్రెస్ కోఆర్డినేటర్ల నియామకం

ఇల్లెందు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ పరిధి మండలాల వారీగా కాంగ్రెస్ ఎన్నికల కోఆర్డినేటర్లను నియమించినట్లు ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం తెలిపారు. ఇల్లెందు మున్సిపాలిటీకి మడుగు సాంబమూర్తి, ఎండీ జాఫర్, యదలపల్లి అనసూర్య, బోళ్ల సూర్యం, చల్లా శ్రీనివాసరావు, ఎస్‌కే జానీ, అంకెపాక నవీన్, మండల పరిధిలో సూర్నపాక సత్యనారాయణ, పులి సైదులు, మండల రాము, పూనెం సురేందర్, అరెం కిరణ్, పాయం కృష్ణప్రసాద్, తాటి భిక్షం, ముక్తి కృష్ణ, గుగులోత్ నాగార్జున, ఎట్టి హరికృష్ణ, ఆముదాల ప్రసాద్, కిన్నెర నర్సయ్య, భూక్యా శంకర్, మెట్ల కృష్ణ, టేకులపల్లి మండలానికి కోరం సురేందర్, ఈది గణేష్, ఇస్లావత్ రెడ్యానాయక్, చింత సురేష్, బండ్ల రజిని, చిలివేరు చంద్రశేఖర్, ఎస్‌కే పాషా, గడ్డం మధు, కోమట్ల వసంతరావు వారికి కేటాయించిన గ్రామపంచాయతీలకు కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారని వివరించారు.

భూఆక్రమణదారులపై చర్య తీసుకోండి


మాట్లాడుతున్న ప్రమోద్

ఇల్లెందురూరల్: ప్రభుత్వ ఖాళీ స్థలాల ఆక్రమణలపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ దాస్యం ప్రమోద్‌కుమార్, స్థానికులు డిమాండ్ చేశారు. మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ ఆజాద్‌నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆజాద్‌నగర్‌లో సుమారు ఎకరం విస్తీర్ణంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని శుక్రవారం రాత్రి కొంతమంది డోజర్, ప్రొక్లెయిన్‌తో చదును చేశారని తెలిపారు. ఖాళీ స్థలంలో ఉన్న చేతిపంపును ఛిద్రం చేశారని, మురుగునీటి ప్రవాహాన్ని దారిమళ్లించారని చెప్పారు. ఖాళీ స్థలాన్ని స్థానికంగా ఉన్న పేదలకు పంపిణీ చేయాలని, ఆక్రమించుకుంటే ఊరుకోబోమన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు తక్షణం విచారణ నిర్వహించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో స్థానికులు నిమ్మల రాములు, బోడ లోక్యా, కోటయ్య, రజాక్, వాసం లక్ష్మి, మునగాల జ్యోతి, బండ స్వాతి, ఈసాల పార్వతమ్మ, బచ్చల విజయ ఈసాల బేబి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అల్పాహారం

చుంచుపల్లి: జమాతే ఇస్లామీ హింద్ రుద్రంపూర్, రామవరం శాఖ ఆధ్వర్యంలో శనివారం పెనగడపకు చెందిన పలువురు ముస్లింలు ఉపాధి కార్మికుల మధ్య ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది కూలీలకు అల్పాహారంగా సేమ్యా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ వ్యవస్థాపకుడు భాషిత్, ఫాతిమా, రజాక్, షమీబాయ్, పర్వీన్, సలీమున్నిసా బేగం, షబానా, అనీష్ ఫాతిమా, రుక్సానా, ఆసియా, రేష్మ, సయ్యద్ హుష్మియా పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహాలకు పూజ చేస్తున్న గ్రామస్తులు


ఇల్లెందు(టేకులపల్లి): మొక్కంపాడు తండాలో పూజలో పాల్గొన్న గ్రామస్తులు

ఇల్లెందు: పట్టణంలోని 1వ వార్డు సత్యనారాయణపురం శ్రీ విజయ కోదండ రామాలయం వద్ద సరస్వతీ దేవి, విఘ్నేశ్వర విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాన్ని మామిడి తోరణాలు, ముగ్గులు, ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణ, హోమం, పూజా కార్యక్రమాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఈ ప్రతిష్ఠా కార్యక్రమం సందర్భంగా నాగుల్‌మీరా మౌలాచాన్ దర్గా నుంచి పవిత్ర జలాలతో మహిళలు ఊరేగింపుగా తరలివచ్చారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు వారా రవి, అంకెపాక నవీన్, సీహెచ్ వెంకన్న, పీకే శ్రీను, ఇరసంగి వెంకన్న ప్రత్యేక పూజలు చేశారు.

మొక్కంపాడు తండాలో...

ఇల్లెందు(టేకులపల్లి): మొక్కంపాడు తండాలో శనివారం శ్రీలక్ష్మి, భూలక్ష్మి సహిత శీతల పరమేశ్వరి (బొడ్రాయి), శ్రీ రేణుక పరమేశ్వరి (ముత్యాలమ్మ), శ్రీ రణపోతురాజు గ్రామ దేవతల ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఆదివారం బోనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఎంపీపీ భూక్యా రాధ, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేయరూ..

- ప్రమాదకరంగా తడికలపూడి – చీమలపాడు రోడ్డు
- అవస్థలు పడుతున్న స్థానికులు


అధ్వానంగా ఉన్న తడికలపూడి - చీమలపాడు రోడ్డు

ఇల్లెందు(టేకులపల్లి): ఆడుతూ.. పాడుతూ.. ఆనందంగా గమ్యానికి చేరేందుకు రహదారులు ఉపయోగపడాలి. తక్కువ సమయంలో ఎక్కువ దూరం వెళ్లేందుకు వీలుగా రోడ్లు ఉండాలి. పాలకుల నిర్లక్ష్యమో...అధికారుల అలసత్వమో కానీ టేకులపల్లి – చీమలపాడు రహదారి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఏడు కిలోమీటర్ల ఈ మార్గంలో భయపడుతూ వెళ్లాల్సిన దుస్థితి. టేకులపల్లి మండలం తడికలపూడి నుంచి కారేపల్లి మండలం చీమలపాడు వరకు బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. టేకులపల్లి మండల వాసులు ఇల్లెందు మీదుగా ఖమ్మం వెళ్లాలంటే దూరభారం, ట్రాఫిక్ ఉంటుంది. అదే తడికలపూడి నుంచి చీమలపాడు మీదుగా తిమ్మారావుపేట వయా ముచ్చర్ల క్రాస్‌రోడ్ నుంచి ఖమ్మం వెళితే దూరం తగ్గడంతో పాటు ట్రాఫిక్ ఉండదు. వివిధ అవసరాల నిమిత్తం వ్యాపారులు, ప్రజలు, ఉద్యోగులు ఈ మార్గంలోనే ప్రయాణం సాగిస్తుంటారు. తడికలపూడి నుంచి చీమలపాడు వరకు మొత్తం ఏడు కిలోమీటర్లు అడుగడుగునా ప్రమాదకరంగా గుంతలు పడటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది.

కంకర తేలి అధ్వానంగా ఉండటం వల్ల అదుపు తప్పి కిందపడటం, గాయాలపాలు కావడం, రాత్రి మరింత ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. పాలకులు స్పందించి ఈ రహదారికి నిధులు కేటాయించి తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ రోడ్డుకు సంబంధించిన సుమారు రెండేళ్ల క్రితమే ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.3.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా పంపారు. మంజూరు కూడా అయింది. టెండరు కూడా పూర్తయింది. కానీ ఏం జరిగిందో ఏమో నేటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి..



తిమ్మారావుపేట నుంచి తడికలపూడి వరకు రోడ్డు గుంతలు, కంకర తేలి ఉండటంతో ప్రయాణం ఇబ్బందిగా ఉంటోంది. నా కళ్లముందే చాలామంది అదుపు తప్పి బైక్‌పై నుంచి కింద పడ్డారు. అధికారులు స్పందించాలి.
– కొండలరావు, తిమ్మారావుపేట

చాలా ఇబ్బంది పడుతున్నాం..



తడికలపూడి నుంచి కారేపల్లి మండలం తిమ్మారావుపేట, ఖమ్మం వెళ్లాలంటే ఇదే మార్గం. దశాబ్దాలుగా పక్కా రోడ్డు కోసం ఎదురు చూస్తున్నాం. మంజూరైంది అంటున్నారు కానీ, పనులు ప్రారంభం కావడం లేదు.
– మూతి రామనాథం, తడికలపూడి

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



తడికలపూడి నుంచి చీమలపాడు వరకు బీటీ రోడ్డుకు రూ.3.5 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. మంజూరు అయింది. అగ్రిమెంట్ కూడా జరిగింది. త్వరలోనే రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించడం జరుగుతుంది.
– రాంబాబు, ఆర్‌అండ్‌బీ ఏఈ, టేకులపల్లి